క్లుప్తంగా

నేడు టెంకాయల వేలం

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలో శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలకు శుక్రవారం టెంకాయల వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు. టెంకాయలు, లడ్డు, పులిహోరా వేలంలో పాల్గొనే వారు రూ.1లక్ష డిపాజిట్ చేయాలన్నారు. వేలం పాటలో పాల్గొనే వారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు హాజరు కావాలన్నారు.

ఈదమ్మ జాతర తైబజార్ వేలం

కొల్లాపూర్: ఈదమ్మ జాతర తైబజారు వేలం పాట గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ సమక్షంలో నిర్వహించారు. బి. కురుమయ్య, హోటల్ మహేష్‌లు ఇద్దరు మాత్రమే వేలంలో పాల్గొన్నారు. వారిలో మహేష్ రూ.3 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. నిర్ణీత ధరల ప్రకారం జాతరలో తైబజారు వసూలు చేయనున్నట్లు తెలిపారు.

హమాలీ రేట్ల పెంపుపై హర్షం

కొల్లాపూర్: సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల పెంపుపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద హమాలీ కార్మికులతో సమావేశమయ్యారు. ఇది సీఐటీయూ సాధించిన విజయమని పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో పలువురు హమాలీలు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన నారాయణ రాకేష్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో వారికి రూ.1లక్షా 2వేల చెక్కును ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, సందీప్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సిద్దార్థరెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ



తాడూరు: మడల కేంద్రంలోని రెవెన్యూ మండల పరిషత్ కార్యాలయాలను ఆర్డీఓ సురేష్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కంప్యూటర్‌లో డేటా ఎంట్రీ నమోదును పరిశీలించి ఆపరేటర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని, త్వరగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కమిటీ



తాడూరు: మండలంలోని వెయ్యి గొంతుకలు కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామాలతో పాటు మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శివప్రసాద్, రమేష్ తెలిపారు. మండల అధ్యక్షులుగా పల్లె రమేష్, ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శిగా అనిల్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఐతోలు లక్ష్మయ్య, డప్పు రవి, బాల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన ఉపాధ్యాయులు



తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం 'రోడ్డు భద్రత' అనే అంశంపై జిల్లాస్థాయి పోటీలలో తెలకపల్లి శాంతినికేతన్ విద్యార్థిని శ్రీవాణి రెండో స్థానం దక్కించుకుంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ దీప సెబాస్టియస్, పాఠశాల యాజమాన్యం సురేందర్‌రావు, ఇంద్రకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



మగ్దుంపూర్ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



రాంరెడ్డిపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

లబ్ధిదారుల ఎంపికలో నిర్లక్ష్యం చేయొద్దు

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి అందించాలని, క్షేత్ర స్థాయిలో అధికారులు సర్వే చేసే లబ్ధిదారులను ఎంపిక చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చౌదర్‌పల్లిలో గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ లబ్ధిదారులను గుర్తించాలన్నారు.



వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పాలబిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యేకు విన్నతి

గ్రామంలో చాలా మంది పాల ఉత్పత్తితో రైతులు జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. కానీ ప్రభుత్వం వారికి సకాలంలో బిల్లులు అందించడం లేదని గ్రామానికి చెందిన మల్లేష్‌యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లో పెండింగ్ బిల్లులు అందించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందిస్తాం

● ప్రభుత్వం ప్రజాపాలనలో అర్హులైన వారికి కుల, మత, రాజకీయవర్గ విభేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. బల్మూర్ మండలంలోని తుమ్మెన్‌పేటలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తుమ్మెన్‌పేట–గట్టుతుమ్మెన్ రోడ్డు నిర్మాణం కోసం త్వలోనే నిధులు మంజూరు చేయడంతో పాటు ఊర చెరువు కాల్వ పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

● లింగాల మండలంలోని కొత్తచెర్వుతండా, మగ్దుంపూర్ గ్రామసభల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. అర్హులైన వారు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు: అదనపు కలెక్టర్

● అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. తెలకపల్లి మండలంలోని రాంరెడ్డిపల్లి, జంగమోనిపల్లి, కమ్మరెడ్డిపల్లి, చిన్నముద్దునూరు, రాకొండ, బొప్పల్లి, వట్టిపల్లి, బోరబండ తండాలలో గ్రామ సభలు నిర్వహించారు. రాంరెడ్డిపల్లిలో అదనపు కలెక్టర్ అమరేందర్ మాట్లాడారు.

సజావుగా గ్రామసభలు..

● నాగర్‌కర్నూల్ మండలంలో లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై మూడురోజులుగా గ్రామ సభలు సజావుగా జరిగాయి. జాబితాలో పేర్లులేని లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. అర్హత ఉండి పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

● పెంట్లవెల్లి మండలంలోని కొండూరులో గ్రామ సభకు ఎంపీడీఓ హాజరై అర్హులైన వారిని జాబితాను చదివి వినిపించారు.

● చారకొండ మండలంలో 17 గ్రామాల సభల్లో అర్హుల జాబితాలను ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, తహసీల్దార్ సునిత, మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ చదివి వినిపించారు. ఆత్మీయ భరోసాకు 204, రైతు భరోసాకు 21, రేషన్ కార్డుల కోసం 453, ఇందిరమ్మ ఇళ్ల కోసం 427 దరఖాస్తులు వచ్చాయి.

● తాడూరు మండలంలోని తుమ్మల సుగుర, గోవిందాయపల్లి, ఎంగంపల్లి, పాల్మూర్, అల్లాపూర్ గ్రామాల్లో గ్రామసభల్లో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ బ్రహ్మాచారి, తహసీల్దార్ కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 13 వ వార్డులో నిర్వహించిన గ్రామసభలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కౌన్సిలర్ తలసాని సౌజన్య జనార్దన్‌రెడ్డి, కమిషనర్ మహబూబ్ షేక్ పాల్గొన్నారు.

గ్రామసభలో ఆందోళన

చారకొండ: మండలంలోని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండాలో ప్రభుత్వ పథకాల్లో అర్హుల పేర్లు నమోదు కాలేదని గ్రామస్తులు గ్రామసభలో ఆందోళన చేశారు. ప్రత్యేకాధికారి తహసీల్దార్ సునిత, ఎంపీఓ వెంకటేష్, కార్యదర్శి శ్రీనును గ్రామస్తులు నిలదీశారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వల్లే జాబితాలో అర్హుల పేర్లు లేవని పేర్కొన్నారు.



పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

పైలెట్ ప్రాజెక్టుగా వ్యవసాయ బోరు

మన్ననూర్: పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రశాంతి నగర్‌కు (మన్ననూర్) మంజూరైన వ్యవసాయ బోర్లను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. వ్యవసాయం పరంగా ప్రోత్సహించేందుకు గ్రామానికి చెందిన 18మంది రైతులకు భూముల్లో సాగునీటి కోసం 18 బోర్లు మంజూరైనట్లు తెలిపారు.

రేపటి నుంచి మైబుసుభాని ఉర్సు

చారకొండ: మండల కేంద్రం సమీపంలో ఉన్న బోడబండలో ఈనెల 25 నుంచి 27 వరకు మైబుసుభాని ఉర్సు షరీఫ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మహ్మద్ సత్తార్, గ్రామపెద్దలు గురువారం ప్రకటనలో తెలిపారు. 25 రాత్రి గంధం, 26న పాతేహా, కందుర్లు, 27న ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండలంలోని రాచూర్, బొల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సూర్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉండడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

తెలకపల్లి: మండలంలోని తాళ్ళపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు నిర్వహించనుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సంతన్‌తేజ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తాళ్ళపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల

కోడేరు: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర 4వ సీపీఎం మహాసభల పోస్టర్లను మండల కార్యదర్శి నర్సింహ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈనెల 25 నుంచి 28వరకు సంగారెడ్డిలో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాటం లక్ష్మయ్య, శివయ్య, ఆనంద్, శివుడు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని నిరసన

తెలకపల్లి: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో ఆర్‌జీ రెడ్డి జూనియర్ కాలేజ్, గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించాలని విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరించి పురవీధుల గుండా ర్యాలీ చేశారు. దేశ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



జిల్లా కేంద్రంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి డీవైఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగపూర్ మధు, అశోక్, రమేష్, మహేందర్, రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నేతాజీ చిత్రపటానికి టీపీసీసీ సభ్యులు రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు స్వీట్లు, నోట్‌పుస్తకాలు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, నాయకులు వెంకటస్వామి, జమీల్ అహ్మద్‌ఖాన్, జుబేర్, బాలపీరు. రామచంద్రుడు, గట్టునాయక్ ఉన్నారు.

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో రాధాకృష్ణ భవన్‌లో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జె. రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షుడు బూసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి మండలంలోని బిజినేపల్లి, పాలెం గ్రామాల్లో నేతాజీ విగ్రహాలను పూలమాల వేసి నివాళులర్పించారు. నవోదయ విద్యాలయంలో ఆయన విగ్రహానికి ప్రత్యేక పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల, గంగారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

● కల్వకుర్తి మండలంలోని తర్నికల్ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, గ్రామస్తులు సురేష్‌గౌడ్, పరమేష్, సందీప్, పరమేష్ పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో స్వీట్లు పంచుతున్న జగదీశ్వరుడు



నవోదయ విద్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అధ్యాపకులు

విద్యుత్ కార్యాలయంలో కొట్లాట!

కల్వకుర్తి టౌన్: కరెంట్ కార్యాలయంలోని రెవెన్యూ వసూలు సెక్షన్ (ఈఆర్‌ఓ) విభాగంలో కొందరు ఉద్యోగులు డివిజన్ ఉన్నతాధికారిపైకి కొట్లాటకు వెళ్లిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. పట్టణంలోని ఈఆర్‌ఓ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగికి బదిలీ అయినా అతను అక్కడకు వెళ్లకుండా ఇక్కడే పనిచేస్తానని హైకోర్టుకు వెళ్లి ఇక్కడే విధులు నిర్వహించేలా స్టేటస్– కో తెచ్చుకున్నాడు. గతేడాది జూలైలో బదిలీలు కాగా, పలు కారణాలతో బదిలీలలో మోడీఫికేషన్ తీసుకొచ్చి ఇక్కడే విధులు నిర్వహించారు. మోడీఫికేషన్ ఆర్డర్లు 2024 డిశంబర్‌లో రద్దు చేసి, బదిలీలు జరిగిన ప్రాంతానికే వెళ్లాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. సీనియర్ అసిస్టెంట్లు, ఫోర్‌మెన్లు మాత్రం వారి పాత స్థానాల నుంచి వెళ్లలేదు. నూతన ఉత్తర్వుల ప్రకారం బదిలీ చేసిన స్థానానికి వెళ్లకుండా ఉన్న ఉద్యోగులు జనవరి నెలలో ఎక్కడా ఉద్యోగం చేసినట్లుగా రికార్డులలో నమోదు కాలేదు. ప్రతినెలలో 23న ఉద్యోగులకు సంబంధించిన జీతాల ఫైల్‌ను అప్రూవల్ కోసం పంపుతారు. కల్వకుర్తి డివిజన్‌లో ఉద్యోగం చేయకున్నా, వారికి సంబంధించిన జీతాలను ఎందుకు చేయలేదని వారంతా ఏఏఓ రాజేశ్వర్‌రెడ్డి చాంబర్‌లోకి వెళ్లి గంటపాటు దుర్భాషలాడుతూ నానా హైరానా సృష్టించారు. హైరానా సృష్టించటమే కాక అందరూ కలిసి కొట్టుకునేంత హంగామాను అక్కడ కార్యాలయంలో సృష్టించారు. ఈ విషయమై ఏఏఓ రాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా, వారంతా కార్యాలయంలోకి వచ్చి తనతో తగువులాడిన విషయం వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కోర్టు ఆర్డర్ ఉండటంతో న్యాయ సలహా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటానని ఆయన తెలిపారు.



పట్టణంలోని ఈఆర్‌ఓ కార్యాలయం

దివ్యాంగులకు నాణ్యమైన ఫిజియోథెరపీ

● డీఈఓ ఏ.రమేష్‌కుమార్

బిజినేపల్లి: ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ ఒక వరమని, శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు నాణ్యమైన ఫిజియోథెరపీ అందించాలని డీఈఓ ఏ.రమేష్‌కుమార్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా 172 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారని, వారికి వారం వారం క్రమం తప్పకుండా ఫిజియోథెరపీని నిర్వహించాలని వైద్యులకు సూచించారు. గురువారం బిజినేపల్లి మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించి, దివ్యాంగ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించారు. అంతకుముందు వట్టెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర, బాలికల పాఠశాలను సందర్శించి వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ రఘునందన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

ముదిరాజులను బీసీ–ఏ లో చేర్చాలి

కందనూలు: ముదిరాజులను బీసీ–ఏలో చేర్చాలని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి శివయ్య చేపట్టిన బస్సు యాత్ర గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకు చేరింది. బస్సు యాత్రకు జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు స్వాగతం పలికారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం ముదిరాజ్ లను బీసీ–ఏలో కలపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని 33 జిల్లాలకు బస్సుయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ముదిరాజులను సంఘటితం చేసి వారిలో చైతన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శివ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు, పరమేశ్వర్, పసుపుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్రకు స్వాగతం పలికిన జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెల్దండ: పశువులకు సోకుతున్న సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బొల్లిగుట్టతండాలో టీఎస్ఎల్‌డీఏ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నివేష్, విజయడెయిరీ అధ్యక్షులు సహదేవుడు, దన్‌సింగ్, కిషన్, వెంకటయ్య, సీతారాం, అంజయ్య, మురళీ, నరేష్, సిబ్బంది నరేష్‌రెడ్డి, నరసింహ, లక్ష్మయ్య, మొగులయ్య, విజయేందర్, బాలు ఉన్నారు.

డంపింగ్‌యార్డు కూలగొట్టిన వారిపై చర్య తీసుకోవాలి



పెద్దకొత్తపల్లి: చిన్నకారుపాముల గ్రామంలో డంపింగ్‌యార్డును కొందరు కూలగొట్టారు. వారిపైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగేందర్‌కు బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పర్శరాములు, శివ, భీమేష్‌రెడ్డి, తిరుమల్, మల్లేష్ శేఖర్, రాజశేఖర్, విజయ్, కురుమయ్య పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన ఆర్టిజన్స్ దీక్షలు



దోమలపెంట: రాష్ట్రంలో విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్లకు కన్వర్షన్ ఇచ్చి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈగలపెంటలో భూగర్భ కేంద్రం ఆర్టిజన్లు జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. జోసెఫ్, శ్రీనివాసులు, కుమార్, మల్లికార్జునరావు, బాలకృష్ణ, శంకర్ రిలే నిరాహార దీక్షలో ఉన్నారు. వారికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు వి.కిషన్, జెన్‌కో(1535)యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకరి లవకుమార్, 327 యూనియన్ నాయకులు అశోక్, ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, రామ్మోహన్, జేఏసీ నాయకులు బీ.లక్ష్మయ్య, ఏ.శివశంకర్‌రెడ్డి శిబిరం వద్ద సంఘీభావం తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ



తెలకపల్లి: మండలంలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వడ్డెదేరంగుల రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, మల్లయ్య, ఖలీల్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వెల్దండ: అంగన్‌వాడీలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొల్లోనిపల్లిలో అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కొన్ని ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత భవనం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, సంజీవ్ కుమార్, వెంకట్‌రెడ్డి, ఫుల్‌సింగ్, చందునాయక్, దేశ్యానాయక్, సామేల్, టీచర్ శివలీల ఉన్నారు.

శ్మశాన వాటికలకు బాట విడిపించాలని వినతి

పెద్దకొత్తపల్లి: కల్వకోల్ గ్రామానికి చెందిన ఎస్సీ మాల, గొడ్స్, మంగళి, కావలి, ఎరుకలి కులాలకు చెందిన శ్మశాన వాటికకు రహదారి లేకుండా రైతు బాలస్వామి రెండెకరాల భూమిని ఆక్రమించాడు. శ్మశాన వాటికలకు రహదారికి వెళ్లేందుకు బాట విడిపించాలని 100 మంది గ్రామస్తులు తహసీల్దార్‌కు జేకే మోహన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, వెంకటేష్, శంకరయ్య, శివ, నాగరాజు, బాలస్వామి, బుడ్డయ, పరమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి తెలకపల్లి గ్రామసభలో చేసిన వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు కావాలన్నా కాంగ్రెస్ కార్యకర్తలు చెపితేనే వారికి ఇస్తారని, తాను అధికారులకు ఆదేశాలిచ్చానని అన్న మాటలను బీఎస్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఎమ్మెల్యే ఆ మాటలను వెంటనే వెనక్కి తీసుకోని జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొత్తపల్లి కుమార్, పృథ్వీ, తదితరులు ఉన్నారు.

యువకులకు కౌన్సెలింగ్

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామంలో బుధవారం రాత్రి 12 గంటల సమయంలో అనుమానంగా ముగ్గురు యువకులు తిరుగుతున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. వారిని వివరాలు కోరగా, మద్యం, గంజాయి తాగినట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని యువకులను వెల్దండ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన బచ్చుకూర మహేష్, అరవింద్, చిత్తారి మహేష్‌లుగా వారిని గుర్తించారు. రాచూర్ గ్రామానికి చెందిన మాడ్గుల సాదు అనే స్నేహితుడి వద్దకు వచ్చినట్లు వారు తెలిపారు. గురువారం ఎస్ఐ కురుమూర్తి వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని ఎక్కడైన గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువకులను తల్లిదండ్రులకు అప్పగించారు.